క్లుప్తంగా

దళిత, గిరిజనుల సంక్షేమానికి కృషి: బలాల


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దాసురావు, చందు నాయక్

మలక్‌పేట: తెలంగాణ రాష్ట్ర దళిత, గిరిజన సేవా సంఘం నాయకులు మంగళవారం మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలను పంజేషా హాలోని నివాసంలో కలిశారు. నాలుగోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన సందర్భంగా బలాలను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దళిత, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యేను సన్మానించిన వారిలో రాష్ట్ర అధ్యక్షుడు బట్టు దాసురావు, ప్రధాన కార్యదర్శి చందులాల్‌నాయక్, సంఘం సభ్యులు ఉన్నారు.

ఆత్మవిశ్వాసం, పట్టుదలతో మంచి ఫలితాలు


మాట్లాడుతున్న భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణ

మన్సూరాబాద్: విద్యార్థులు ఆత్మవిశ్వాసం, పట్టుదలతో ఉంటే మంచి ఫలితాలు సాధిస్తారని భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణ అన్నారు. వనస్థలిపురం భాష్యం పాఠశాల 10వ తరగతి విద్యార్థుల ప్రేరణ కార్యక్రమం మన్సూరాబాద్‌లోని ప్రలవి గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతోపాటు ముఖ్య సలహాదారు మైఖేల్, సీఈఓ చైతన్య ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, సత్ప్రవర్తన, నైతిక విలువలతో కూడిన విద్య వికసిస్తుందన్నారు. విద్యార్థుల్లో ప్రేరణ కల్గిస్తూ ఆనందాన్ని నింపుతూ విద్యకున్న విలువను గొప్పతనాన్ని తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జోన్‌లోని మూడు భాష్యం శాఖల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపేటలో...

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం భాష్యం పాఠశాల 10 వ తరగతి విద్యార్థులకు 2023–2024 వార్షిక పరీక్షలపై ప్రేరణ సదస్సును కొత్తపేటలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన భాష్యం విద్యా సంస్థల చైర్మన్ రామకృష్ణ విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. జడ్ఈఓ అంకమ్మరావు, ఆర్‌కేపురం ప్రిన్సిపాల్ అప్పారావు, వివిధ బ్రాంచ్‌ల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి


బీటీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ అభివృద్ధి పనులను త్వరిగతిన పూర్తిచేయాలని హస్తినాపురం కార్పొరేటర్ భానోతు సుజాతా నాయక్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మంగళవారం ఆమె డివిజన్ పరిధి అగ్రికల్చర్ కాలనీలో జరుగుతున్న బీటీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని ప్రతికాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కాలనీవాసులు తమ కాలనీలోని సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎఈ హేమునాయక్, కాలనీవాసులు తాండ్ర మణిపాల్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి: డబ్ల్యూపీఐ

నాగోలు: కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకం వల్ల ఆటో కార్మికుల ఉపాధి దెబ్బతినే పరిస్థితి నెలకొందని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా (డబ్ల్యూపీఐ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాయబడి పాండురంగం అన్నారు. మంగళవారం కొత్తపేటలోని వర్కర్స్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటోలు ఎక్కే మహిళా ప్రయాణికుల సంఖ్య బాగా తగ్గిపోయిందన్నారు. ఆటో కార్మికులు ఉపాధి లేక రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆటో కార్మికుల పక్షాన ఉద్యమించాల్సి వస్తుందని పాండు రంగం హెచ్చరించారు. సమావేశంలో వర్కర్స్ పార్టీ నాయకులు నాయకులు కామేశ్వరరావు, కొప్పు యాదయ్య,ఎస్‌వీ రాములు తదితరులు పాల్గొన్నారు.

వృథా అవుతున్నా.. యంత్రాంగం కదలదే!

- రోడ్డుపై పారుతున్న మిషన్ భగీరథ నీరు
- తొమ్మిది నెలలుగా సమస్య
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు


కందుకూరు చౌరస్తాలో లీకవుతున్న మిషన్ భగీరథ పైప్‌లైన్

కందుకూరు: మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకై తాగునీరు రోడ్డుపై పారుతూ ఇబ్బందికరంగా మారింది. కందుకూరు చౌరస్తాలో ఈ సమస్య నెలకొని తొమ్మిది నెలలు అవుతున్నా పట్టించుకునే నాథుడే లేరు. దీంతో స్థానికులతో పాటు ఆ రహదారిపై ప్రయాణించే వారికి తిప్పలు తప్పడం లేదు. మరోపక్క తాగునీటిలో మురుగు నీరు కలిసి ప్రజలు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం పొంచి ఉంది.

నిత్యం అవస్థలు

హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై కందుకూరు చౌరస్తాలో రెండు చోట్ల మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకులు ఏర్పడ్డాయి. దీంతో నిత్యం తాగునీరు రోడ్డుపై లీకై పారుతుండటంతో స్థానికులు, వ్యాపారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి కావడంతో పాటు మండల, డివిజన్ కేంద్రం కావడంతో నిత్యం అక్కడికి ఇతర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున వస్తుంటారు. లీకేజీతో ఆ రహదారిపై నడవడానికి అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై నుంచి వాహనాలు వెళ్లే క్రమంలో బురద చిందడం, లీకైన నీటి మీద నుంచే దాటి షాపులకు వెళ్లి వస్తువులు కొనుగోలు చేసుకొని రావాల్సి ఉండటంతో అక్కడికి వచ్చిన వారు నానా అగచాట్లు పడుతున్నారు.

కలుషితమవుతున్న నీరు

పైప్‌లైన్ నుంచి తాగునీరు లీకవుతుండగా, ఆ సమీపంలో ఉన్న హోటళ్లు, దుకాణాల సముదాయం నుంచి వచ్చే మురుగు ఆ నీటిలో కలిసిపోతుంది. దీంతో ఆ ప్రాంతంలో పారిశుద్ధ్య సమస్య నెలకొంది. మరోపక్క తాగునీరు సరఫరా కానీ సమయంలో మురుగు నీరు పైపుల్లోకి చేరేలా ఉంది పరిస్థితి. ప్రజలు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం పొంచి ఉంది. అధికారులు ఆ రహదారి నుంచే రాకపోకలు సాగిస్తున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యాపారం దెబ్బతింటోంది



నెలల తరబడి తాగునీరు లీకై రోడ్డుపై పారుతోంది. దీంతో వినియోగదారులు నీటిపై నుంచే దాటి రావాల్సి రావడంతో ఇబ్బందిగా ఉంది. మేము వస్తువులు బయటి నుంచి షాపులోకి తెప్పించుకునే క్రమంలో కూడా తిప్పలు తప్పడం లేదు. సమస్య ఎప్పటికీ పరిష్కరిస్తారో తెలియడం లేదు. అధికారులు స్పందించాలి.

–ఎస్.లక్ష్మారెడ్డి, వ్యాపారి, కందుకూరు చౌరస్తా

త్వరగా పరిష్కరించాలి



తొమ్మిది నెలలకు పైగా కందుకూరు చౌరస్తాలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకై తాగునీరు వృథాగా పారుతూనే ఉంది. అందులోకి మురుగు నీరు చేరి దుర్వాసన వ్యాపిస్తోంది. సమస్య పరిష్కరించకుండా అధికారులు తాత్సారం చేస్తున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలి.

–బి.సంజీవరెడ్డి, కొత్తగూడ

రోడ్డు పనులు ప్రారంభం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్‌లో ఉన్న డ్రీమ్ సిటీలో బీటీ రోడ్డు పనులను మేయర్ చిగురింత పారిజాతరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొత్తగా కొలువు దీరిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు వేగంగా పుంజుకుంటాయన్నారు. ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో రెండు పథకాలు ఇప్పటికే అమలు చేసి ప్రజల్లో మన్ననలు పొందుతున్నారన్నారు. మిగిలిన పథకాలను త్వరలో అమలు చేస్తుందన్నారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లో అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా చూస్తామన్నారు. అనంతరం కాలనీ ముస్లిం సోదరులు మేయర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మనోహర్, బాలునాయక్, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.


మేయర్ పారిజాతరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

మంగళప్రదంగా పూజలు

- సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలలో శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో వైభవంగా కార్తీక మంగళవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి దర్శనానికి భక్తులు ఉదయం నుంచి బారులు తీరారు. కొందరు నైవేద్యంగా బోనాలు సమర్పించారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, పాలక మండలి సభ్యులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


అమ్మవారు

సమస్యల పరిష్కారమే ముఖ్యం

- ప్రతి మంగళవారం ప్రజావాణి
- కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి


అధికారులతో సమావేశమైన కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి సూచించారు. మంగళవారం సరూర్‌నగర్ వార్డు కార్యాలయంలో జీహెచ్ఎంసీ అధికారులతో ఆమె సమావేశమయ్యారు. కాలనీలలో సమస్యలు తాండవిస్తున్నాయని, ప్రధానంగా దోమల బెడద తీవ్రంగా ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి మంగళవారం వార్డు కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తామన్నారు. 'మా సరూర్‌నగర్–మా సమస్యల పరిష్కారాలు' అంటూ నిర్వహించే కార్యక్రమం ప్రజలకు ఉపయోగపడుతుందన్నారు. ఇంజినీరింగ్, ఎంటమాలజీ, శానిటేషన్ అధికారులు కాలనీవాసుల ఫిర్యాదులు తీసుకొని ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారం చేయాలన్నారు. సమావేశంలో జేబీ కాలనీ అధ్యక్షుడు రవిందర్‌రెడ్డి, మాధవరెడ్డి, వెంకటేష్, నరసింహాపురి కాలనీ అధ్యక్షుడు హనుమంత్‌రాయుడు, సాయికృష్ణానగర్ కాలనీ అధ్యక్షుడు యాదగిరిచారి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


జిల్లెలగూడ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు

మీర్‌పేట: కార్తీకమాసం సందర్భంగా మీర్‌పేట జిల్లెలగూడలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను ఆలయ ఆవరణలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ధర్మకర్తలు యాదగిరిముదిరాజ్, జ్ఞానేశ్వరచారి, ఆలయ పూజారులు పాల్గొన్నారు. ప్రశాంతిహిల్స్‌లోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో స్థానిక కాలనీవాసులు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

ఆధ్యాత్మికతతోనే శాంతి స్థాపన


ప్రవచనం చేస్తున్న గురూజీ అనిల్‌కుమార్‌జోషి

కందుకూరు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక బాటలో నడవాలని, అప్పుడే సమాజంలో శాంతి వెల్లివిరుస్తాయని బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి సూచించారు. మంగళవారం మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో అమావాస్యను పురస్కరించుకుని గురూజీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా హోమం నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానంతో పాటు ఆశీర్వాదాలు అందించారు. ఈసందర్భంగా ఆయన భక్తులకు ప్రవచనాలు చేశారు. ఆధునిక సమాజంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించి పురోగమించాలంటే నిత్యం సాధన అవసరమన్నారు. తమతో పాటు పది మందికి ఉపయోగపడేలా నడుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


వేడుకలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

మంచాల: మండల పరిధిలోని నోముల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠశాలలో తరగతులు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తా రి రాజిరెడ్డి, ఉపాధ్యాయులు బాలునాయ క్, నవనీత, విజయ్‌కుమార్, బాలరాజ్, ఐలయ్య, రజినీ, మాధవి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన తూర్పు కాలనీల నాయకులు

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మరోసారి విజయం సాధించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని వనస్థలిపురం తూర్పు కాలనీల సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత సుధీర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో ఎల్‌బీనగర్‌ను మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. అధ్యక్షుడు దీపావళి శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గుత్తా లక్ష్మణ్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్, జలంధర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న వనస్థలిపురం తూర్పు కాలనీల సంక్షేమ సంఘం నాయకులు

రోషన్‌దౌల్తాలో నీటి ఎద్దడిని నివారించండి


జలమండలి ఎండీకి వినతిపత్రం అందజేస్తున్న మధుయాష్కీ

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్‌లోని రోషన్‌దౌల్తాలో తాగునీటి ఎద్దడిని నివారించాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మధుయాష్కీ గౌడ్ మంగళవారం హెచ్ఎండబ్ల్యూఎస్ మేనేజింగ్ డైరెక్టర్ దానకిషోర్‌ను కలిసి కోరారు. ఈ సందర్భంగా యాష్కీ మాట్లాడుతూ, రోషన్‌దౌల్తా బస్తీలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో బస్తీనిద్ర చేయటంతో సమస్యలను బస్తీవాసులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. స్పందించిన దానకిషోర్ సంబంధిత జోనల్ మేనేజర్‌ను పిలిపించి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారన్నారు. రక్షణశాఖ అధికారులతో చర్చించి తక్షణమే తాత్కాలిక నల్లా కనెక్షన్లు ఇవ్వాలని, ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేయాలని అధికారులను దానకిషోర్ ఆదేశించారని ఆయన స్పష్టం చేశారు.

బీఆర్‌ఎస్ హయాంలో చెరువు కబ్జా

టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ


హత్తిగూడ చెరువును పరిశీలిస్తున్న మధుయాష్కీ, సీపీఐ నాయకులు

మన్సూరాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఎల్‌బీనగర్‌లోని చెరువులన్ని కబ్జాకు గురయ్యాయని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. హయత్‌నగర్ మండలం మన్సూరాబాద్ డివిజన్ పరిధి సర్వే నంబర్ 98,99లలో హత్తిగూడ చెరువును సీపీఐ నాయకులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మధుయాష్కీ మాట్లాడుతూ, విజయవాడ జాతీయ రహదారి పుల్లారెడ్డి స్వీట్స్ షాపు నుంచి హత్తిగూడ చెరువు వరకు సుమారు 6 కాలనీలు క్రిడా (వ్యవసాయ పరిశోధన) సంస్థ నుంచి వచ్చే వరదనీటితో నిండిపోయి పూర్తిగా జలమయం అవుతున్నాయన్నారు. చెరువులోకి సాఫీగా వరదనీరు పోయే ప్రాంతాలు కబ్జాకు గురయ్యాయని, దీంతో లక్ష్మీభవానీనగర్ ముంపునకు గురవుతోందని స్పష్టంచేశారు. చెరువు నాళాలను కబ్జా చేసిన వారిని గుర్తించి చర్యలు చేపట్టాలని స్థానిక ఆర్డీఓను కోరారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే, రెవెన్యూ అధికారులు, పోలీసులు, కుమ్మక్కై కబ్జాదారులకు సహకరించారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి గ్రేటర్ హైదరాబాద్‌లోని చెరువులను కాపాడుతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి, ఎల్‌బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గజ్జి శ్రీనివాస్‌యాదవ్, సునిల్‌గౌడ్, బాబా యాదవ్, శ్రీధర్, కృష్ణ, రమావత్ సక్రు తదితరులు పాల్గొన్నారు.

ఆరంభంతోనే ఆగిన 'సుందరీకరణ'

- మురుగు కూపంగా సరూర్‌నగర్ చెరువు
- పేరుకుపోయిన గుర్రపు డెక్క.. దోమల విజృంభణ
- అనారోగ్యం పాలవుతున్న చెరువు సమీప కాలనీవాసులు


చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

లింగోజిగూడ: సరూర్‌నగర్ చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చి దిద్దడం మాట అటుంచి.. రోజురోజుకూ దుర్గంధభరితంగా మారుతుండటంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. సరూర్‌నగర్ చెరువును సుందరీకరించి చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామన్న ప్రజాప్రతినిధులు మాటలు ఆచరణలోకి రాలేదు. పనులు ప్రారంభ దశలోనే ఆగిపోయాయి. చెరువు చుట్టూ పలుచోట్ల ఏర్పాటు చేసిన కంచె మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. చిన్నపాటి గాలివానకే కంచె నేలకొరిగింది. చెరువులో గుర్రపు డెక్క విపరీతంగా పెరిగిపోవడంతో దోమల ఉత్పత్తి కేంద్రంగా మారింది.

కాలనీలపై దోమల దాడి:

- సరూర్‌నగర్ చెరువులో విపరీతంగా గుర్రపు డెక్క పెరిగిపోయింది. రాత్రి, పగలు తేడా లేకుండా దోమలు దాడి చేస్తున్నాయని, దోమల వల్ల రాత్రిపూట కంటిమీద కునుకు పడటం లేదని చెరువు సమీప కాలనీవాసులు వాపోతున్నారు.
- సాయంత్రం అయితే చాలు దోమల కారణంగా తలుపులు మూసుకొని ఉండాల్సి వస్తోందని చెప్తున్నారు.
- దోమ కాట్లతో ఒంటిపై దద్దుర్లు వస్తున్నాయని, కొందరు డెంగీ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడుతున్నారని
- సరూర్‌నగర్ చెరువుకు ఆనుకొని ఉన్న గ్రీన్ పార్క్ కాలనీ, తపోవన్ కాలనీ, తపోవన్ కాలనీ ఫేజ్– 1, శ్రీనివాస కాలనీ, శ్రీరామ్‌నగర్, వడ్డెర బస్తీతో పాటు పలు కాలనీల ప్రజలు తెలిపారు.
- దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయాల్సిన జీహెచ్ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది ఆచూకీ ఉండటం లేదని, ఫిర్యాదులు చేస్తే తప్ప ఫాగింగ్ చేయడం లేదని ఆరోపిస్తున్నారు.

డెక్క తొలగింపులో ఇబ్బందులు.....

సరూర్‌నగర్ చెరువులో పేరుకపోయిన గుర్రపు డెక్క తొలిగింపులో జీహెచ్ఎంసీ సిబ్బందికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి చెరువులో భారీగా పేరుకపోయిన డెక్కను తొలగించాలని స్థానిక కాలనీవాసులు ఫిర్యాదులు చేయడంతో మంగళవారం ఎట్టకేలకు గుర్రపు డెక్క తొలగింపునకు చర్యలు చేపట్టారు.

- కాలనీ గుర్రపు డెక్క అధికంగా నీరు తక్కువ లోతు ఉన్న ప్రాంతాలలో పేరుకపోవడంతో యంత్రాలను పెట్టి తొలగించాలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో సిబ్బందితోనే తొలిగించాల్సి వస్తోంది. సిబ్బందితో తొలగిస్తే కనీసం 15 రోజుల నుంచి 20 రోజుల వరకు పడుతోంది. దీంతో ఒకవైపు తొలగించే లోపు మరోవైపు డెక్క పెరిగే అవకాశం ఎక్కువగా ఉంది.

తొలగింపు పనులు వేగవంతం చేస్తాం...

సరూర్‌నగర్ చెరువు వద్ద చేపట్టిన గుర్రపు డెక్క తొలగింపు పనులను జీహెచ్ఎంసీ ఫోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ఎంటామాలాజిస్ట్ ఏఈ మణెమ్మతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గుర్రపు డెక్క వీలైనంత త్వరగా తొలగించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. వీలైన చోట యంత్రాలతో తొలగించే విధంగా చర్యలు చేపడతామన్నారు. డ్రోన్ల ద్వారా కెమికల్స్ పిచికారీ చేయించామన్నారు. నీటిలో దోమల లార్వా ఎదగాకుండా చర్యలు తీసుకున్నామని, కాలనీలలో కూడా ప్రత్యే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

గుర్రపు డెక్క తొలగింపునకు 15 నుంచి 20 రోజులు...

సరూర్‌నగర్ చెరువులో అధిక శాతం గుర్రపు డెక్క నీరు తక్కుగా ఉన్న చోట పేరుకుపోవడంతో తొలగింపులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.లోతు తక్కువగా ఉండటంతో యంత్రాలను పెట్టాలేని పరిస్థితి నెలకొంది దీంతో సిబ్బంది సహాయంతో గుర్రపు డెక్కను తొలగిస్తున్నాం. డెక్క పూర్తి స్థాయి తొలగింపుకు 15 నుంచి 20 రోజులు పట్టే అవకాశం ఉంది. దోమల నివారణకు కాలనీలలో ఎప్పటికప్పుడు ఫాగింగ్ చేస్తున్నాం.